క్లుప్తంగా...

టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల జట్టు ఎంపిక

ఘట్‌కేసర్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాపోటీలు, జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు గురువారం ఉదయం 8.30 గంటలకు ఇన్‌స్పైర్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఈసీఐఎల్ వద్ద క్రీడలు ప్రారంభం అవుతాయని, అండర్–14 క్రీడాకారులు ఉదయం 8.30 రిపోర్ట్ చేయాలని, అండర్–17 మధ్యాహ్నం 12.30 రిపోర్ట్ చేయాలని సూచించారు. పోటీలకు వచ్చే క్రీడాకారులు అర్హత ఫామ్‌తో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, పోయిన ఏడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా తేవాలని, ఒక పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు మాత్రమే ఎంపికకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 83744 61482, 75694 04074.

స్వచ్ఛత ర్యాలీ

మేడ్చల్‌రూరల్: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని మునీరాబాద్, ఎల్లంపేట్ తదితర గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తడి, పొడి చెత్త, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచులు గణేశ్, వెన్నెల రామకృష్ణుడు, ఉపసర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాధవరెడ్డికి నివాళి



మేడ్చల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గౌడవెల్లికి చెందిన సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతిని గౌడవెల్లిలో సోమవారం నిర్వహించారు. ఆయన కుమారుడు పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, నాయకులు గ్రామ పరిధిలోని మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వరదారెడ్డి, రమణారెడ్డి, బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేష్, కొండల్‌రెడ్డి, గోపాల్, వినోద్‌గౌడ్, జీవన్‌రెడ్డి, స్వామి ఉన్నారు.

వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ర్యాలీ

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వై అశ్విక్, పరుశరాం, రాంచందర్, బాలనర్సింహ, శివకుమార్, నర్సింగ్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో రూ.10 లక్షల మున్సిపాలిటీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జంగయ్యముదిరాజ్, జహంగీర్, విజయ్‌ముదిరాజ్, సందీప్, సాయికిరణ్, స్థానికులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె కుషాయిగూడ బస్తీ దవాఖానాను ఆకస్మికంగా సందర్శించారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. ఆరోగ్యలక్ష్మీ పథకం అమలు తీరుపై వైద్య సిబ్బందితో మాట్లాడారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్..

చర్లపల్లి చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలన్నారు. ఏఈ స్వరూప, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చల్ల ప్రభాకర్, సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జై జై గణేశా..

వినాయక చవితి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పూలు, పండ్లు, పత్రిల మధ్య వినాయకుడు దర్శనమిచ్చారు. గణనాథుడికి ఇష్టమైన కుడుములు, పిండితో చేసిన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. బస్తీలు, కాలనీల్లో ఎటు చూసిన భక్తిగీతాలతో గణేశ్ మండపాలు కనిపించాయి. జై బోలో గణేశ్ మహారాజ్‌కి జై అంటూ నామస్మరణతో మండప పరిసరాలు మార్మోగాయి.



అన్నోజిగూడ సూర్య యూత్ అసోసియేషన్ మండపంలో మంత్రి మల్లారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి



చీర్యాలలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ ఇందిరాలక్ష్మీ నారాయణ



నాగారంలో గణనాథుడి పూజల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



దమ్మాయిగూడలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్



పోచారంలో ఎస్‌వైఆర్ ఫౌండేషన్ చైర్మన్ సామల యాదిరెడ్డి ఆధ్వర్యంలో పూజలో మంత్రి మల్లారెడ్డి



కండ్లకోయలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి తదితరులు



జవహర్‌నగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న మేయర్ కావ్య



మేడ్చల్ రాఘవేంద్రనగర్ కాలనీలో పూజలు చేస్తున్న కౌన్సిలర్ దేవరాజు



పూడూర్‌లోని మహదేవ్ యూత్ ఆధ్వర్యంలో సర్పంచ్ బాబుయాదవ్, నాయకులు



ఘట్‌కేసర్‌లో మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్ దళితవాడలో చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ మల్లేశ్



అవుషాపూర్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

ఓటరు జాబితా పొరపాట్లు లేకుండా రూపొందించాలి



- జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు వాకాటి కరుణ
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకంగా ఉండేలా ఓటరు జాబితా రూపొందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అమయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాపై ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ, ఐదు నియోజకవర్గాల నుంచి వచ్చిన దరఖాస్తులు, అందులో ఉన్న ఆక్షేపణలపై తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత నియోజకవర్గాల అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు) సూపర్‌వైజర్లకు ఓటరు నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించి ఎలా అనుసరిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక శిబిరాల్లో, నేరుగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పూర్తి చేయాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎక్కడైనా పొరపాట్లు, తప్పిదాలను గుర్తిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువస్తే.. వెంటనే వాటిని సరి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. బోగస్ ఓటర్లకు ఆస్కారం లేకుండా పక్కాగా తుది జాబితా రూపొందేలా రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు.

ఓటరు జాబితా ప్రక్రియ పారదర్శకం: కలెక్టర్ అమయ్‌కుమార్

జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో ఓటరు జాబితా ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 1వ తేదీన భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు పూర్తి వివరాలతో సమగ్రమైన తుది ఓటరు జాబితా రూపొందించి, 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించేందుకు సంబంధిత అధికారులు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ కవితతో దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కౌన్సిలర్లు

కీసర: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లు ఎమ్మెల్సీ కవితను నగరంలోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. కౌన్సిలర్లు, కొత్త సురేఖ, పాండాల అనురాధ, మాదిరెడ్డి పావనిరెడ్డి, మోర మౌనిక, సంపనబోలు స్వప్న, కొత్త హేమలత, నాగాయపల్లి సుజాత తదితరులు ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగిన టాక్స్ గోల్‌మాల్‌పై మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ మంగళవారం ఫిర్యాదు చేశారు.రూ.3.13 కోట్ల అవకతవకలపై కిందిస్థాయిలో ఉన్న వారిపై చర్యలు తీసుకొని మొత్తానికి బాధ్యత వహించాల్సిన కమిషనర్లకు నోటీసులు జారీ చేయడమేమిటని ఫిర్యాదులో ప్రశ్నించారు. మనీలాండరింగ్ చట్టం నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర పురపాలక సంఘాల కమిషనర్ల విధులు నియమావళిని అనుసరించి గోల్‌మాల్‌కు ప్రత్యక్ష కారకులైన మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఘట్‌కేసర్: పేకాట ఆడుతున్న ముగ్గురిని మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన పిల్లాయిపల్లికి మహేశ్(43), వట్టిపల్లి రాఘవేంద్ర(40), తోటకూర శ్రీనివాస్(50) ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. వారి నుంచి ఒక సెట్ పేకాట కార్డులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.7,850ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

జవహర్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ గబ్బిలాలపేట సిక్కులోని బావి సమీపంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతిచెంది ఉన్నాడని డాక్టర్లు తెలిపారు. మృతుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా ఆధారు కార్డులో వడ్డే బాలకృష్ణ, నారాయణపేట జిల్లా బహార్‌పేట అని ఉంది. తెలిసిన వారు ఫోన్: 87126 62097, 99517 65915.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మున్సిపల్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం అని గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామానికి చెందిన మైసనోళ్ల సత్తమ్మ అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.55 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, నాయకులు స్వామి, రాజేందర్ ముదిరాజ్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ రజిత, సర్పంచ్ గీత

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి అందజేశారు. గ్రామానికి చెందిన ప్రేందాస్‌యాదవ్‌కు దాదాపు రూ.20 వేలు, బి.శ్రీనాథ్‌కు రూ.60 వేలు మంజూరు కావడంతో చెక్కులను గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు ప్రవీణ్‌కుమార్, దామోదర్‌రెడ్డి, ఆనంద్, గిరీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



కుషాయిగూడ: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ బస్టాండ్ వద్ద ప్రతి మంగళవారం అంబేడ్కర్‌కు పూలమాల వేసే కార్యక్రమం 300 రోజులకు చేరిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, డిపో మేనేజర్ చంద్రకాంత్, డిపో ప్రెసిడెంట్ వంగూరి హరీష్, డిపో సెక్రటరీ గౌడ కిరణ్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ గడ్డం శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు భారీ బందోబస్తు



రాంపల్లి పాత చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తదితరులు



వినాయకసాగర్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

కీసర: గణేష్ నవరాత్రుల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం గణేష్ ఉత్సవాల సందర్భంగా నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి పాతచెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసిన వారు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. పండగను ప్రశాంతంగా జరుపుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ముందుండాలన్నారు. రాంపల్లి పాతచెరువులో ప్రతియేడు నాగారం, దమ్మాయిగూడ, చర్లపల్లి, కుషాయిగూడ, నాచారం, రాంపల్లి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాల నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందని, ఇందుకోసం మున్సిపల్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, పోలీస్, వైద్య తదితర శాఖల ఆధ్వర్యంలో నిమజ్జన కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రశాంతంగా నిమజ్జనం చేయడంతో పాటు చెరువులో నుంచి ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు తీసేవిధంగా మున్సిపల్ నుంచి ఏర్పాట్లు చేశామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, సీపీ చౌహాన్‌కు తెలియజేశారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య, ఎస్‌ఐలు నాగరాజు, కౌన్సిలర్లు నాగేష్‌గౌడ్, లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భద్రత కట్టుదిట్టం..

ఘట్‌కేసర్: వినాయకసాగర్ ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువును రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సోమవారం రాత్రి మాల్కాజిగిరి ఏసీపీ నరేశ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చెరువు లోతు, విగ్రహాల ఎత్తు, ఏర్పాట్లపై పలు శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ గణేశ్ విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగేందుకు క్రేన్లు, భారీకేడ్లు, నీటి వసతి, గజఈతగాళ్లు, లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంవత్సరం మరింత కట్టుదిట్టమైన భద్రత చేపట్టి విజయవంతం చేస్తామన్నారు. విగ్రహాల నిమజ్జనం కేవలం జీహెచ్‌ఎంసీ, పోలీసులు మాత్రమే చేస్తారని, విగ్రహాలను తీసుకొచ్చే భక్తులను నిమజ్జనం చేయడానికి అనుమతించకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీ గిరిధర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పావనీజంగయ్య, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఇరిగేషన్ ఏఈ పరమేశ్, కౌన్సిలర్ మల్లేశ్, కుమార్ ముదిరాజ్, జంగయ్యయాదవ్, సుధాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, ఎస్సైలు అశోక్, శేఖర్ పాల్గొన్నారు.

6 సంక్షేమ పథకాలను తప్పకుండా అమలుచేస్తాం



కాంగ్రెస్ సంక్షేమ పథకాల అవగాహన ర్యాలీలో కాంగ్రెస్ నేతలు తదితరులు

దమ్మాయిగూడలో కాంగ్రెస్ నేతల ర్యాలీ

కీసర: రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ విజయభేరి సభలో ప్రకటించిన 6 సంక్షేమ పథకాలు (6 గ్యారెంటీ హామీలు) కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యతగా అమలు చేయడం జరుగుతుందని గోవా మాజీ పీసీసీ అధ్యక్షుడు గిరీష్‌చోడాంకర్, చారకొండ వెంకటేష్ అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో టీపీసీసీ అధికార ప్రతినిధి, టీపీసీసీ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 సంక్షేమ పథకాల అవగాహన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సోనియా గాంధీ తుక్కుగూడలోని విజయభేరి సభలో 6 సంక్షేమ పథకాలను ప్రకటించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏళ్లలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ గోగుల సరిత, ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు సింగరేణి పోచయ్య, వేముల మహేష్‌గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త సుశాంత్‌గౌడ్, సోమేష్, కీసర మండల యూత్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, నేతలు కిషోర్‌గౌడ్, నానావత్ సురేష్, ముప్ప రామారావు, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోల కృష్ణాయాదవ్, సామల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, ఏనుగు సంజీవరెడ్డి, శ్రీలత, మాదవి, రాజులత, ఈగ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

కీసర: ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, నాగారం మున్సిపాలిటీ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం ఈమేరకు నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి రెవెన్యూ సర్వే నంబర్–316లో గల అసైన్డ్ స్థలాల్లో వెలిసిన రెండు గదులను జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా రాంపల్లి సర్వే నెంబర్–316లోని అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపి సదరు స్థలాన్ని కాపాడాలని నాగారం మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ కార్యాలయంలో, కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



రాంపల్లిలోని సర్వే నంబర్–316లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..

వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన పోలీసులు



చిన్నయ్యను కాపాడుతున్న ఘట్‌కేసర్ పోలీసులు

ఘట్‌కేసర్: రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకోవాలని యత్నించిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కాపాడారు. శంషాబాద్‌కు చెందిన వెల్దండ చిన్నయ్య(40) ఘట్‌కేసర్‌లో రైల్వే ట్రాక్‌పై పడుకొని ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్య సరళమ్మకు ఫోన్ ద్వారా తెలపడంతో ఆమె వెంటనే డయల్ 100 ద్వారా ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. అడ్మిన్ ఎస్సై అశోక్ తక్షణమే స్పందించి చిన్నయ్య సెల్ ఫోన్ లొకేషన్ కోసం మల్కాజిగిరి డీసీపీ కార్యాలయానికి రిక్వెస్ట్ చేసి లొకేషన్ తెప్పించుకొని సిబ్బందిని పంపించారు. లొకేషన్ ప్రకారం నారాయణ గార్డెన్ ముందున్న రైల్వే ట్రాకుపై చిన్నయ్య పడుకొని ఉండటంతో అతడిని పక్కకు తప్పించారు. చిన్నయ్య 10 ఏళ్లుగా బోడుప్పల్ గాయత్రీనగర్‌లో చికెన్ షాప్ నడుపుతుండగా రెండేళ్లుగా ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నట్లు తెలిసింది. అనంతరం చిన్నయ్య భార్య సరళమ్మ, బంధువులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్‌లో వారికి అప్పగించారు. వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన అడ్మిన్ ఎస్సై అశోక్, పెట్రో మొబైల్ సిబ్బంది సురేశ్, రాజన్న, హోంగార్డు నాగరాజును సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

ప్రజా సంక్షేమానికి గ్యారెంటీ కాంగ్రెస్

మల్కాజిగిరి: తెలంగాణలో ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే కేఎస్ అలగిరి, తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం, కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. బంగారు తెలంగాణ ఏర్పాటు కోసమే సోనియా గాంధీ రాష్ట్రాన్ని ప్రకటిస్తే ఉద్యమకారుల ఊపిరితో పీఠమెక్కిన కేసీఆర్ విస్మరించి నియంత పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కర్నాటకలో హామీలను అమలు చేసిందని, తెలంగాణలో కూడా ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. పార్టీ నాయకులు విస్తృతంగా పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో గ్యారెంటీ కార్డుల పంపిణీ